రైతుల మేలు కోరు'కొనేలా'..

కల్లాల చెంతనే మిర్చి కొనుగోళ్లు
- కమీషన్, రవాణా ఖర్చులు ఆదా
- డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టుతో రైతులకు మేలు
- పైలట్ ప్రాజెక్టుగా కూసుమంచి డివిజన్



మిర్చి కొనుగోలు చేస్తున్న సంస్థ ప్రతినిధులు

కూసుమంచి: రైతులు తాము పండించిన పంట మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముకోవటం.. ఇందుకోసం వ్యయప్రయాసలు పడటం సర్వసాధారణం. కానీ వ్యవసాయశాఖ సహకారంతో డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు వారు మిర్చి పంటను నేరుగా రైతుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సాగు–బాగు ప్రాజెక్టులో భాగంగా డిజిటల్ గ్రీన్ సంస్థ ఒప్పందం చేసుకుని మిర్చి రైతులకు సేవలు అందిస్తున్నారు. ఇందుకు జిల్లాలో తొలుత కూసుమంచి వ్యవసాయ డివిజన్‌ను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈమేరకు కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్, మండలాల్లో ఎంపిక చేసిన రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 100 క్వింటాళ్లను సేకరించారు.

మట్టి నమూనాల నుంచి మార్కెటింగ్ వరకు..
డిజిటల్ గ్రీన్ సంస్థ ద్వారా కేవలం మిర్చిని కొనుగోలు చేయటమే కాకుండా పంట ప్రారంభం నుంచి తుది వరకు అనేక సేవలు అందిస్తున్నారు. ఈ సంస్థ పైలట్ ప్రాజెక్టుగా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాలను ఎంపిక చేసింది. ఇట్టి మండలాల్లో మిర్చి సాగు చేపట్టే 1,050 మంది రైతులను ఎంపిక చేసి రైతులకు మిర్చి సాగు చేసే ముందు భూసార పరీక్షలు నిర్వహించటం, మట్టి నమూనాలను బట్టి ఎరువులు, మందులను సిఫార్సు చేయటం లాంటి సహకారం అందించారు. ఇందుకోసం సంస్థ ద్వారా 45 మంది సీఆర్పీలను నియమించి వారికి శిక్షణను అందించారు. రైతులు మిర్చి వేసిన తర్వాత అట్టి రైతులను వాట్సాప్ గ్రూప్‌గా తయారు చేసి వారికి మిర్చి సాగులో మెళకువలు అందించారు. వారికి వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు వాట్సాప్ ద్వారా తెలియజేశారు. ఇలా మిర్చిలో తెగుళ్ల నివారణ, సస్యరక్షణ తదితర అంశాలపై రైతులకు వీడియోలు, మేసేజ్‌ల ద్వారా అవగాహన కల్పించారు. దీంతో అట్టి రైతులు నాణ్యమైన దిగుబడులను సాధించగలిగారు.

మద్దతు ధరతో కొనుగోళ్లు..
ఇక మిర్చి చేతికి వచ్చిన తర్వాత డిజిటల్ గ్రీన్ సంస్థ కాల్గుడి అనే సంస్థ సహకారంతో వ్యాపారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి మిర్చిని కొనుగోలు చేపట్టారు. తొలుత వారు మిర్చి నాణ్యతను ప్రత్యేక యంత్రాల ద్వారా పరిశీలించి నాణ్యతను బట్టి ధరను నిర్ణయించి కొనుగోళ్లు చేపట్టారు. ఇప్పటి వరకు మార్కెట్ ధరకు అనుగుణంగా రూ.21,500 ధర వరకు చెల్లించి ఎటువంటి కమీషన్, రవాణా చార్జీలు లేకుండా మిర్చి కొనుగోళ్లు చేపట్టామని సంస్థ ప్రతినిధి శోభ 'సాక్షి'కి తెలిపారు. రానున్న రోజుల్లో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మిర్చి రైతులకు తమ సేవలు అందిస్తామని, కొనుగోళ్లు చేపడతామని వివరించారు.

21 క్వింటాళ్లు అమ్మాను..



నేను డిజిటల్ గ్రీన్ సంస్థకు 21 క్వింటాళ్ల మిర్చిని అమ్మాను. క్వింటాకు రూ.21,500 చెల్లించారు. ఎటువంటి కమీషన్, రవాణా చార్జీలు లేవు. దీంతో నాకు రూ.40వేల వరకు ఆదా అయింది. ఈ అవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి. రైతుల వద్దకే సంస్థ వారు వచ్చి కొనుగోలు చేయడం సంతోషకరం.

– పోలూరి రవి,రైతు, గట్టుసింగారం

రైతులకు మంచి అవకాశం..



వ్యవసాయశాఖ సహకారంతో డిజిటల్ గ్రీన్ ప్రాజెక్టు ద్వారా రైతులకు మిర్చి సాగులో మెళకువలు నేర్పడం, మట్టి నమూనాల సేకరణ, మార్కెటింగ్ వంటి కార్యకలాపాలు చేపట్టారు. ఇది రైతులకు ఒక మంచి అవకాశం. జిల్లాలో తొలుత కూసుమంచి డివిజన్‌ను ఎంపిక చేయగా.. పంట సాగులో మంచి ఫలితాలు వస్తున్నాయి.

– విజయచంద్ర, ఏడీఏ, కూసుమంచి

బీసీల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం



నేలకొండపల్లి: మాట్లాడుతున్న రామారావు

నేలకొండపల్లి/తిరుమలాయపాలెం: రానున్న ఎన్నికల్లో బీసీలకు అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యత కల్పించాలని బీసీ జేఏసీ జిల్లా అధ్యక్షుడు పాల్వంచ రామారావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిండిప్రోలు రామ్మూర్తి డిమాండ్ చేశారు. గురువారం నేలకొండపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో రామారావు, తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెంలో నిర్వహించిన మండల సమావేశంలో రామ్మూర్తి మాట్లాడారు. చట్టసభలో బీసీలకు అవకాశం కల్పిస్తే వారి గెలుపు కోసం బీసీ జేఏసీ కృషి చేస్తుందన్నారు. బీసీల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని, రిజర్వేషన్ శాతం తగ్గించినా పార్టీలో ఉన్న బీసీ ప్రజాప్రతినిధులు మాట్లాడకపోవటం బాధకరమని పేర్కొన్నారు. బీసీ బంధు, బీసీ సబ్ ప్లాన్ నిధులు, రుణాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం పాలేరు డివిజన్ బీసీ జేఏసీ కన్వీనర్‌గా పాగర్తి సుధాకర్‌ను ఎన్నుకున్నారు. నేలకొండపల్లి సమావేశంలో అన్నారపు రాములు, మారిశెట్టి వెంకటేశ్వర్లు, సత్యనపలి రాము, తొగటి నాగచారి, రామవరపు నాగరాజు, పంతంగి నరసింహారావు, బండి బ్రహ్మం, గోపి, దమ్మాయిగూడెం కార్యక్రమంలో నాయకులు సైదులు, గోవర్ధర్, కృష్ణ, రమేష్, మహేష్, బ్రహ్మం వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉధృతంగా ఉద్యమం



కూసుమంచి: ఐకేపీ ఏపీఎంకు సమ్మె నోటీస్ అందజేస్తున్న వీఏఓలు

నేలకొండపల్లి/కూసుమంచి: సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకురాలు రాజపుత్ర పార్వతిబాయి, వీఏఓల సంఘం మండల అధ్యక్షురాలు వి.జయమ్మ, కార్యదర్శి నాగమణి హెచ్చరించారు. గురువారం ఆయా మండల కేంద్రంలో ఎంపీడీఓ, తహసీల్దార్, ఎస్సై, ఐకేపీ ఏపీఎంలకు సమ్మె నోటీసులు అందించిన సందర్భంగా వారు మాట్లాడారు. కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. అర్హులైన వీఓఏలకు సీసీలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నుంచి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో సంఘం నాయకురాలు గుత్తికొండ రాణి, బందెల రూప, బాజా వనజ, కూచిపూడి అనిత, శీలం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే విధులు కేటాయించాలి

ఖమ్మం సహకారనగర్: ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో నిబంధనల మేరకే విధులు కేటాయించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డీఈఓ సోమశేఖర శర్మకు వినతిపత్రం సమర్పించాక మాట్లాడారు. నిబంధనల మేరకు విధులు కేటాయించని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గరికె శ్రీను, వీరన్న, వెంకటేశ్వర్లు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ నారాయణ'లో గ్రాడ్యుయేషన్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని తెలంగాణ నారాయణ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్లు గన్నవరపు చంద్రశేఖర్, లక్కిరెడ్డి చంద్రశేఖర్, కొదుమురు నాగపవన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాల్యం నుంచే ప్రతి ఒక్క చిన్నారిని సరైన దారిలో నడిపితే వారి భవిష్యత్తు బంగారుమయంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ పట్టాలు బహూకరించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరేంద్రవర్మ, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం



మహిళకు కళ్లజోడు అందిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్‌లో గల ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌లు కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ కంటి పరీక్షలు చేయించుకొని ప్రభుత్వం ఉచితంగా అందించే కళ్లద్దాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ రాంబాబు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పీహెచ్‌సీ వైద్యులు నాగమణి, శిరీష, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్ స్ప్రింగ్ లీఫ్'లో కాన్వొకేషన్ వేడుకలు

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి వద్ద గల హార్వెస్ట్ స్ప్రింగ్‌లీఫ్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం నిర్వహించిన కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. చిన్నారులకు ప్రత్యేక వస్త్రాలు ధరించి వేడుకలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పి.రవిమారుతి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవడంతో జీవితంలో రాణించగలరని తెలిపారు. ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జన్మదిన వేడుకలు

ఖమ్మంఅర్బన్: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించుకొని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఖమ్మం పార్లమెంట్ అబ్జర్వర్ కూరపాటి వెంకటేశ్వర్లు టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి.. వృద్ధాశ్రమంలో నగర పార్టీ కోఆర్డినేటర్ వడ్డెం విజయ్ ఆధ్వర్యాన పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తా సీతయ్య, రాష్ట్ర కార్యదర్శి నాగండ్ల మురళి, సానబోయిన శ్రీనివాస్ గౌడ్, చలసాని ఝాన్సీరాణి, పారుపల్లి సురేష్, ప్యారిస్ వెంకన్న, మందపల్లి కోటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకుల ఫైనాన్సింగ్‌పై సమావేశం..

ఖమ్మంఅర్బన్: ఫైనాన్సింగ్ బ్యాంకులతో సహకార సంఘాలు పడుతున్న ఇబ్బందులపై బుధవారం ములుకనూరు సహకార సంఘంలో చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి అధ్యక్షతన 103 సీడెడ్ సంఘాల చైర్మన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘాలు ఫైనాన్సింగ్ బ్యాంకుల ద్వారా పొందిన రుణాలపై పడుతున్న ప్రాసెసింగ్ చార్జీలు, అధిక వడ్డీరేట్లు, టీడీఎస్ చార్జీలు తదితర వాటిపై చర్చించారు. బ్యాంకులతో వస్తున్న సమస్యలను ప్రజాప్రతినిధులను కలిసి వివరించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బి.నాగచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల వితరణ

కూసుమంచి: కూసుమంచిలోని శాఖ గ్రంథాలయానికి ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి 20 కుర్చీలను వితరణ చేశారు. గురువారం గ్రామానికి చెందిన పలువురు నిరుద్యోగ యువకులు ఎమ్మెల్యేను కలిసి గ్రంథాలయంలో చదువుకునేందుకు కుర్చీలు లేవని తెలపటంతో ఎమ్మెల్యే ఈ వితరణ చేశారు.

ఇళ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఇళ్ల స్థలాలు, జాగా ఉన్న వారి ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.10 లక్షలు అందజేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాపంథా, ఇఫ్టూ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, వంట గ్యాస్‌పై 50 శాతం సబ్సిడీ, లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, పీహెచ్‌సీలో వైద్య సేవలు, సమయపాలన, సాదాబైనామా ద్వారా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసరాలు వస్తువులు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై ఈనెల 24న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజాపంథా నాయకులు



ఖమ్మంరూరల్: తహసీల్దార్ సుమకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాపంథా నాయకులు

మతోన్మాద బీజేపీని తరిమికొడదాం



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

రఘునాథపాలెం: మతోన్మాద బీజేపీని తరిమికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రామన్నపేట, కామంచికల్, దారేడు, పడమటితండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపోరు యాత్రకు సీపీఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మార్గమధ్యలో సీపీఐ సీనియర్ నాయకుడు హనుమంతు కృష్ణయ్య, మాదాల వీరభద్రం స్థూపాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ... బీజేపీ కేవలం మతచిచ్చుని ప్రేరేపించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. దేశ సంపదను కొల్లగొడుతూ కార్పొరేట్లకు కట్టబెట్టడమే కాకుండా వారి అప్పులకు పెద్ద ఎత్తున సబ్సిడీలను కూడా ఇస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ.. అభివృద్ధి అనే మాటను గాలికొదిలేసి అమ్ముకోవడం, దోచుకోవడం, ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడం పనిలోనే బీజేపీ పాలన కొనసాగుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, ఏపూరి లతాదేవి, జిల్లా ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సింగు నరసింహారావు, రావి శివరామకృష్ణ, సీహెచ్ సీతామాలక్ష్మి, పోటు కళావతి, జిల్లా సమితి సభ్యులు పుచ్చకాయల కమలాకర్, ఓరుగంటి శేషగిరి, యడ్లపల్లి శంకరయ్యతో పాటు కలింగ మోహన్‌రావు, నువ్వుల మోహన్‌రావు, మేదరమట్ల వెంకటనరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్లు పంపిణీ



రంజాన్ కిట్ అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రకాశ్‌నగర్‌లోని మసీదు సిద్దికియాలో అవామే ఏ హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హఫీజ్ జవ్వాద్ అహ్మద్, ఖమ్మం కాల్వొడ్డులోని దారుల్‌ఉలుమ్ ఇస్లామియా మదర్సాలో ఆలిండియా బైతుల్ ఇమ్దాత్ చారిటబుల్ ట్రస్ట్ ఖమ్మం బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం నిరుపేద ముస్లింలకు రంజాన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు ఎండీ జావిద్, నాయకులు రబ్బానీ, మసీదు కోశాధికారి జహీర్, బాధ్యులు ఫెరోజ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు గఫూర్, రషీద్, రియల్టర్లు షేక్ ఖలీల్, ఖాదర్‌సాబ్, ట్రస్టు ఖమ్మం బ్రాంచ్ ఇన్‌చార్జ్ మౌలానా సయీద్ అహ్మద్ ఖాస్మి, హఫీ జవ్వాద్, బాధ్యులు మౌలానా సాదతుల్లా, హఫీజ్ ఫజలుల్లా, హఫీజ్ నజీర్, ముఫ్తీ సల్మాన్,తదితరులు పాల్గొన్నారు.

'న్యూ రిడ్జ్'లో రంజాన్ వేడుకలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని న్యూ రిడ్జ్ పాఠశాలలో గురువారం రంజాన్ వేడుకలను నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ కావూరి పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ప్రార్థనలు చేశారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కందాల



ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కందాల

ఖమ్మంరూరల్: పాన్నేకల్ మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దావత్ ఏ ఇఫ్తార్ విందులో గురువారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'క్రైచ్'ను సద్వినియోగం చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: ఉద్యోగినుల సౌకర్యార్థం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన క్రైచ్(పిల్లల సంరక్షణ కేంద్రం)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఓ ప్రకటనలో సూచించారు. మహిళా ఉద్యోగులు విధుల నిర్వహణకు ఇబ్బంది కలగకుండా వారి పిల్లలను ఈ కేంద్రంలో అప్పగించి సాయంత్రం తీసుకెళ్లవచ్చని తెలిపారు. కేంద్రంలో ఆట వస్తువుల సమకూర్చడమే కాక సిబ్బందిని నియమించామని పేర్కొన్నారు.

ఆరోగ్య భద్రత కార్డులు పంపిణీ



మాట్లాడుతున్న ఆస్పత్రి ఎండీ ఏడుకొండలు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు గ్రామంలో గురువారం ఖమ్మం శ్రీరక్ష ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య భద్రత కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ ఏడుకొండలు మాట్లాడుతూ.. పిండిప్రోలు గ్రామ సర్పంచ్ రాయల నాగేశ్వరరావు ఇటీవల గుండెపోటుతో మరణించగా.. ఆయన జ్ఞాపకార్థం ఈ కార్డులు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్డు ద్వారా ప్రతీ కుటుంబంలో ఐదుగురు సభ్యుల చొప్పున ఉచిత కన్సల్టేషన్‌తో పాటు ఆరోగ్య పరీక్షల్లో రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తొలుత ఆరోగ్య భద్రత కార్డు పోస్టర్లను స్వాతంత్ర్య సమరయోధుడు తాతా వెంకటకృష్ణమయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కార్యదర్శి కమ్మకోమటి నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ నామా ప్రసాద్, ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటస్వామి, నవీన్, గోకనపల్లి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలతో మెరుగైన వైద్య సేవలు



శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ వెంకటేశ్వర్లు

నేలకొండపల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం పల్లె దవాఖానాలు ఏర్పాట్లు చేసిందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్ తెలిపారు. మండలంలోని గువ్వలగూడెంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించనున్న పల్లె దవాఖానాకు గురువారం సర్పంచ్ వంగూరి వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ.. ప్రతీ పల్లె దవాఖానాకు వైద్యులను నియమించి ప్రజల ముంగిట్లోకి వైద్యాన్ని ప్రభుత్వం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వంగూరి ఉష, ఉప సర్పంచ్ కందుల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ లిక్కి వీరబాబు, గ్రామ పెద్దలు కందుల సైదారావు, వంగూరి ఉపేందర్‌రావు, ముప్పాల వెంకయ్య, ఖాసిం, రమణ, గంగాధర్‌రావు, అంగన్‌వాడీ టీచర్ రమ, ఉమ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచి.. సకాలంలో అందించాలి



మాట్లాడుతున్న అర్చక సంఘం నాయకులు

ఖమ్మంఅర్బన్: అర్చకులకు గత నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వచ్చే అరకొర జీతం సరిపోవడం లేదని ధూప దీప నైవేద్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసుదేవశర్మ, కార్యదర్శి అన్నవజ్జుల ప్రసాద్ శర్మ అన్నారు. జిల్లా ధూప దీప నైవేద్య సంఘం సర్వసభ్య సమావేశం గురువారం నగరంలోని రాజరాజేశ్వరి కల్యాణ మండపంలో జిల్లా అధ్యక్షుడు మునగలైట్ రమేష్‌శర్మ, కార్యదర్శి భార్గవాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్చకులకు నెలకు వచ్చే రూ.6 వేల జీతం కుటుంబ పోషణకు సరిపోవడం లేదని, గౌరవ వేతనం కింద రూ.22,500 ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్ల సాధనకు త్వరలో రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడురామలింగేశ్వరశర్మ, కోశాధికారి పవన్‌శర్మ, అర్చకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన క్యారమ్స్ పోటీలు

ఖమ్మం లీగల్: జిల్లా కోర్టులోని బార్ అసోసియేషన్ హాల్‌లో ఏర్పాటుచేసిన క్యారమ్స్ పోటీలనుజిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. కరోనాతో మృతి చెందిన న్యాయవాదుల స్మారకార్థం ఈ పోటీలు ఏర్పాటుచేశారు. కాగా, మారగాని శ్రీనివాసరావు, రాజబోయిన శ్రీను, కే.వీ.వీ.లక్ష్మి ఈ పోటీల ఆర్గనైజర్లుగా వ్యవహరిస్తున్నారు.

చెత్త తొలగింపు..



విశాలంగా కనిపిస్తున్న రోడ్డు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మంస్పోర్ట్స్: మున్సిపల్ సిబ్బంది ఓ చెట్టును కొట్టి ఇరుకుగా ఉన్న రోడ్డులో పడేసి తీయకపోవడంతో ఈ నెల 19న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'అసలే ఇరుకు గల్లీ.. అందులో చెత్త'అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన మున్సిపాల్ సిబ్బంది ఎట్టకేలకు పడేసిన చెట్ల కొమ్మలను తొలగించడంతో రోడ్డు వెడల్పుగా మారినట్లయింది. గత నెల రోజుల సమస్యకు తెరపడడంతో ఆ ప్రాంతవాసులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని పొన్నెకల్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు పొన్నెకల్ గ్రామంతో పాటు బర్లగూడెం గ్రామ ఫీడర్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ సిబ్బంది వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీనివాస్‌కు దళిత రత్న అవార్డు



మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న శ్రీనివాస్

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మంకు చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొరిపల్లి శ్రీనివాస్‌కు దళితరత్న అవార్డు లభించింది. హైదరాబాద్‌లో ఇటీవల ఆయన మంత్రి కొప్పుల ఈశ్వర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్‌తో పాటు కొండ శంకర్, రాజనర్సి, శాంతికుమార్, కుటుంబరావు, వెంకటేశ్, రాజలింగం, మధు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు తగ్గించాలి

ఖమ్మంమయూరిసెంటర్: ప్రతిష్టాత్మక యూనివర్శిటీ పరిధిలో ఉన్న కళాశాలల్లో కోర్స్, పరీక్ష ఫీజులను విచ్చలవిడిగా పెంచడం ద్వారా పేద, మధ్య తరగతి విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని, అధిక ఫీజులను తగ్గించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఉపేందర్, జి.మస్తాన్‌లు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని సంఘ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఉన్న ఫీజు రెట్టింపు చేస్తూ నిర్ణయించడం దారుణమని, ఫీజుల పెంపును వెనక్కి తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు ఆర్కే, సాగర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని గాంధీచౌక్ సెంటర్‌లో గురువారం శ్రీ వరప్రధాత షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. దాతలు మందిర కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, ఝాన్సీలక్ష్మి దంపతులతో పాటు వారి కుటుంబ సభ్యులు పాల్గొని బాటసారులకు మజ్జిగ అందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	దసరా
వినోద	విరుపాక్ష
సాయిరాం	కిసీ కా బాయ్ కిసీ కీ జాన్
ఆదిత్య	బలగం
శ్రీనివాస	రావణాసుర
సుందర్	విడుదల

– ఖమ్మంవ్యవసాయం